జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

 సంపుటి: 3 సంచిక: 562 పేజీలు: 4 వెల : రూ.7

‘జాతీయ వార్త’ చెప్పింది.. అక్షర సత్యమైంది. సంతల నుంచి పెద్ద ఎత్తున పశువులు తరలిపోతున్నాయని.. పెద్ద ఎత్తున దందా సాగుతోందంటూ.. ఇటీవల ‘సంతల్లో కోట్లలో దందా’ అంటూ కథనం ప్రచురించింది. పశువులను అయితే ఘోరాతి ఘోరంగా.. కనీసం మెడ కూడా తిప్పలేని విధంగా మూగజీవాలను వాహనాల్లో కుక్కి అక్రమార్కులు కబేళాలకు తరలించేస్తున్నారు. ప్రతిరోజూ అర్ధరాత్రి వాహనాల్లో పశువులను అక్రమంగా రవాణా చేస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా దళారులు ఈ పశువులను జిల్లాను దాటించేస్తున్నారు. ఎవరైనా అడ్డుకుంటే వారికి ఎంతోకొంత ఇచ్చి మేనేజ్ చేస్తున్నారన్న గుసగుసలు ఉన్నాయి. వాహనాల్లో పశువులు ఉన్నట్టు ఎవరికీ అనుమానం రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



# మూగ వేదన

* వాహనాల్లో కిక్కిరిసి పశువుల తరలింపు * అర్ధరాత్రి ఎవరికీ అనుమానం రాకుండా రవాణా * హైదరాబాద్, తదితర ప్రాంతాలకు సంతల నుంచి తరలింపు * పశువుల కొనుగోలు నుంచి తరలింపు వరకూ దళారులదే బాధ్యత * వారికి పెద్ద ఎత్తున ముడుపులు * పశువుల అక్రమ రవాణాపై మందస, నరసన్నపేట పోలీసుల దాడులు * ఇచ్ఛాపురం వైపు నుంచి వాహనాల్లో తరలిస్తున్న 62 పశువులు పట్టివేత * పలు వాహనాలు సీజ్, గోశాలకు తరలింపు



‘జాతీయ వార్త’లో వచ్చిన కథనం..


జాతీయ వార్త తెలుగు దిన పత్రిక

## సంతల్లో.. కోట్లలో దందా!

* వారాంతపు సంతకు పెద్ద ఎత్తున పశువులు
* వ్యాపారులతో దళారుల కుమ్మక్కు
* ఇక్కడి నుంచే కబేళాలకు రాత్రివేళల్లో తరలింపు
* దళారులు, వ్యాపారుల నుంచి కొందరు పోలీసులు, నేతలకు మామూళ్లు

శ్రీకాకుళం క్రైం, జనవరి 6 (వార్త): జిల్లాలోని వారాంతపు సంతల నుంచి పెద్ద ఎత్తున పశువులు విజయవాడ, హైదరాబాద్, చెన్నై, తదితర పట్టణాలకు రాత్రివేళ గుట్టుచప్పుడు కాకుండా వాహనాల్లో తరలిపోతోంది. కొందరు ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లోని గ్రామాల్లో పశువులను కొనుగోలు చేసి వారాంతపు సంతలకు తీసుకువస్తున్నారు. వాటిని దళారులు కొనుగోలు చేసి పశుమాంసం విక్రయిస్తున్న వ్యాపారులకు, కబేళా నిర్వాహకులకు విక్రయిస్తూ కాసులు చేసుకుంటున్నారు. ఆవులు, ఎద్దులు, బర్రెలు, మేకలు, కోళ్లు, గొర్రెలు ఇలా అన్ని రకాల పశువులు క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. పండగ సమయం కావడంతో జిల్లాలోని కంచిలి, జలుమూరు, ఆమదాలవలస తదితర మండలాల్లోని వారాంతపు సంత జరుగుతుంది. సంతల్లో కోట్లలో ఈ దందా సాగుతోంది. కొందరు వ్యాపారులు, దళారులు కుమ్మక్కై ఈ పశువుల రవాణా సాగిస్తున్నారు. వీరికి కొందరు పోలీసులు, రాజకీయ నేతల అండదండలు పుష్కలంగా ఉన్నాయి. వీరికి ప్రతినెలా మామూళ్లు పెద్ద ఎత్తున దళారులు అందిస్తుంటారన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు పశువులు వ్యాన్లలో తరలిపోతుంటాయి. హైదరాబాద్ నుంచి కొందరు ఇక్కడికి వచ్చి దళారులతో కుమ్మక్కై పెద్ద ఎత్తున పశువులను కొనుగోలు చేస్తుంటారు. పశువుల తరలింపులో ఎటువంటి నిబంధనలు పాటించరు. మూగజీవాలను బంధించి కబేళాలకు తరలిస్తున్నారు. పలుకుబడి ఉన్న వ్యక్తుల అండదండలతో ఈ దందా జరుగుతుండడంతో ఎవరూ నిలదీయలేకపోతున్నారు. పశుసంవర్ధక శాఖ అధికారులకు ఈవిషయం తెలిసినా పెద్ద తలకాయలు ఈ దందాలో ఉండడంతో మనకెందుకులే అన్న ధోరణిలో ఉంటున్నారు. ఆదివారం వేకువజాము రెండు గంటల సమయంలో జమ్ము గ్రామ సమీపంలో పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని జలుమూరు పోలీసులు అడ్డుకున్నారు. నారాయణవలస సంత నుంచి విజయనగరానికి ఓ వాహనంలో తొమ్మిది గేదెలను తరలిస్తుండగా పట్టుకున్నారు. ఇలానే ప్రతిరోజూ అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా సంతల నుంచి వాహనాల్లో పశువులను జిల్లాను దాటించేస్తున్నారు. ఇకనైనా జిల్లా పోలీసు అధికారులు స్పందించి వారాంతపు సంతలపై ఓ కన్నేస్తే ఇక్కడ జరుగుతున్న అక్రమ దందాతో పాటు వెనుకుండి నడిపిస్తున్న వారి బాగోతం బయటపడే అవకాశం ఉంది.

**మందస/నరసన్నపేట, జనవరి 8(వార్త):** మందస ఎస్ఐ కె. కృష్ణప్రసాద్‌కు వచ్చిన సమాచారం మేరకు నాలుగు వాహనాల్లో తరలిస్తున్న పశువులను పట్టుకున్నారు. మందస మండలంలోని బాలిగాం గ్రామం సమీపంలో గల జాతీయ రహదారిపై ఈ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇచ్ఛాపురం వైపు నుంచి పలాస వైపు నాలుగు వాహనాల్లో 17 పశువులను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఈ వాహనాలను సీజ్ చేశామని, పశువులను సమీప గోశాలలకు తరలిస్తున్నామన్నారు. అలాగే నరసన్నపేట జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న పశువుల కంటైనర్‌ను పోలీసులు గురువారం అడ్డుకున్నారు. ఇచ్ఛాపురం నుంచి హైదరాబాద్‌కు 10 గోవులు, 35 ఎడ్లను కంటైనర్‌లో తరలిస్తుండగా హైవే పోలీస్ సిబ్బంది అప్రమత్తమై వాహనాన్ని తనిఖీ చేసి పట్టుకున్నారు. అయితే ఈ పశువుల తరలింపుపై ఎవరికీ అనుమానం రాకుండా రవాణాదారులు అన్ని చర్యలు చేపట్టారు. అయితే పోలీసులకు అందిన సమాచారం మేరకు ఎస్ఐ శేఖర్‌రావు సిబ్బందితో కలిసి ఆ వాహనాన్ని పట్టుకున్నారు. కంటైనర్‌ను నరసన్నపేట పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. పశువుల అక్రమ రవాణాకు పాల్పడిన వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# దొంగలున్నారు.. జాగ్రత్త!



* పండగ సమయంలో పల్లెలకు తరలుతున్న పట్టణవాసులు * తాళాలు వేసి ఉన్న ఇళ్లు, ఆలయాలే వారి టార్గెట్ * చైన్‌స్నాచింగ్‌కు పాల్పడుతున్న అగంతకులు * అప్రమత్తతే ఆయుధం * నరసన్నపేట మండలంలో అమ్మవారి ఆలయాల్లో చోరీ * నగదు, నగలు దోచేసిన దొంగలు

**శ్రీకాకుళం/నరసన్నపేట, జనవరి 8(వార్త):** పండగ సమయం కావడంతో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. లేకుంటే ఇళ్లు గుల్లవుతుంది. శనివారం నుంచి సంక్రాంతి సెలవులు కావడంతో పట్టణవాసులు తమతమ సొంత గ్రామాలకు వెళ్లి పండగ చేసుకోవడం ఆనవాయితీ. ఇంటికి తాళాలు వేసి ఇంటిల్లిపాది తమ సొంత గ్రామాలకు వెళతారు. ఇదే అదనుగా చేసుకుని దొంగలు తాళం వేసి వున్న ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని చోరీకి పాల్పడే అవకాశం ఉంది. ప్రజలు తమ సొంత గ్రామాలకు వెళ్లే సమయంలో ఇరుగుపొరుగు వారికి, పోలీసులకు సమాచారం అందించడం మంచిది. అవసరమైతే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే మంచింది. ఇక విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో పెట్టుకుంటే మరీ మంచిది. పండగ సమయంలో మహిళలు ఉదయాన్నే లేచ్చి ఆరుబయట వరండాల్లో ముగ్గులు వేస్తుంటారు. ఆ సమయంలో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలి. ఇటీవల ఆమదాలవలసలో ఓ మహిళ మెడలో పుస్తెలతాడును అగంతకుడు తెంపుకొనిపోయాడు. పట్టణ శివారు ప్రాంతాల్లో ఎక్కువగా చోరీలు జరిగే అవకాశం ఉన్నందున అక్కడి ప్రజలు మరింత జాగ్రత్తలు పాటించాలి. అపరిచిత వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. కాగా, నరసన్నపేట మండలం సత్యవరం అగ్రహారంలో ఉన్న చరణాంబిక ఆలయంలో బుధవారం అర్ధరాత్రి అగంతకులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ హుండీని పగలగొట్టి అందులో ఉన్న నగదును దోచుకెళ్లారు. హుండీలో సుమారు రూ.10 వేలకుపైగా నగదు ఉండవచ్చని ఆలయ నిర్వాహకులు చెబుతున్నారు. చోరీ ఘటన విషయం తెలుసుకున్న ఎంపీపీ అరంగి మురళీధర్ గురువారం ఉదయం ఆలయాన్ని సందర్శించి పరిశీలించారు. హుండీతో పాటు అమ్మవారి నగలు కూడా చోరీకి గురైనట్లు ప్రాథమిక సమాచారం అందిందన్నారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించామని, పూర్తి వివరాలు దర్యాప్తులో తేలాల్సి ఉందని చెప్పారు. అలాగే దూకులపాడు గ్రామంలో కొలువైన జ్యోతి రామలింగేశ్వర స్వామి ఆలయంలో కూడా బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయ అర్చకుడు గణేశ్ అందించిన సమాచారం మేరకు అమ్మవారి శతమానాలు, బీరువాలో భద్రపరిచిన నగదు చోరీకి గురైనట్లు ఆయన వెల్లడించారు. గురువారం ఉదయం ఆలయం తెరిచిన సమయంలో చోరీ విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. నరసన్నపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





## క్రైం వార్తలు



### 8.650 కిలోల గంజాయి స్వాధీనం

**సోంపేట, జనవరి 8 (వార్త):** కొర్లం జంక్షన్ సమీపంలోని జాతీయరహదారి వద్ద ఓ టీ హౌస్ ఎదుట గురువారం అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని బారువ ఎస్ఐ, పోలీసు సిబ్బంది పట్టుకున్నారు. అతని బ్యాగులను తనిఖీ చేయగా 8.650 కేజీల గంజాయి ప్యాకెట్లు పట్టుబడ్డాయి. దీనికి సంబంధించిన వివరాలను సోంపేట సీఐ మంగరాజు వెల్లడించారు. సుశాంత్ గమోంగో అనే వ్యక్తి ఒడిశా రాష్ట్రం మోహన ప్రాంతం నుంచి మహారాష్ట్రలోని థానేకు గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. అతడి నుంచి గంజాయితో పాటు మోటారు సైకిల్, మొబైల్ ఫోన్, రూ.600 స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



### ‘రథసప్తమి’కి నేడు అంకురార్పణ

* 46 నిమిషాల పాటు సామూహిక సూర్య నమస్కారాలు * అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ అధికారులు * వేడుకలకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఎస్పీ పరిశీలన

4లో

## 'ప్రకాశ్‌చంద్ర పాణిగ్రాహి మృతి టీడీపీకి తీరని లోటు'

**మందస, జనవరి 8(వార్త):** తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత ప్రకాశ్ చంద్ర పాణి గ్రాహి ఆకస్మిక మృతి తెలుగుదేశం పార్టీకి తీరనిలోటని పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీషా అన్నారు. మందసకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గుండెపోటుతో ఆకస్మికంగా మరణించిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన కుటుంబాన్ని ఎంఎల్ఏ శిరీషా పరామర్శించి, ఓదార్చారు. పాణిగ్రాహి చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రకాశ్ పాణిగ్రాహి పార్టీకి చేసిన సేవలను వివరించారు. ఈ ప్రాంతంలో పార్టీ విజయంలో ఆయన పాత్ర ఎంతో ఉందన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న అనుచరునిగా, మాజీ మంత్రి శివాజీ సహచరునిగా సేవలందించారన్నారు. ప్రకాశ్ చంద్ర పాణిగ్రాహి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ పీరుకట్ల విఠల్‌రావు, మాజీ ఎంఈఓ గువ్వాడ లక్ష్మీనారాయణ, తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, వర్కింగ్ ప్రెసిడెంట్ రట్టి లింగరాజు, రాజాన మహేశ్, మాజీ సర్పంచ్ దుంకురు తిరుపతి, ముంజేటి చంద్రశేఖర్, ముడిమించి నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## 14 ఉత్తరాంధ్ర వాలీబాల్ పోటీలు




**సరుబుజ్జిలి, జనవరి 8(వార్త):** యరగాం గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఉత్తరాంధ్ర వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి గురువు తిరుమలరావు తెలిపారు. శ్రీ వెంకట కృష్ణ వేణమ్మ వాలీబాల్ టోర్నమెంట్‌గా నిర్వహించే ఈ పోటీలు జనవరి 14, 15, 16 తేదీల్లో నిర్వహిస్తారన్నారు. రాష్ట్ర పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవి కుమార్ సూచన మేరకు క్రీడలను ప్రోత్సహించేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు నగదుతో పాటు ప్రత్యేక క్రీడాకారుల్ని ఎంపిక చేసి బహుమతులు అందిస్తామని తెలిపారు ఈ పోటీల్లో పాల్గొనే జట్లు ఈనెల 10లోగా రాము-9618139325, గణేష్-8977803207, రమణ-70873 91246 అనే నెంబర్లకు ఫోన్ ద్వారా నమోదు చేసుకోవచ్చని ఆయన తెలిపారు మధ్యాహ్నం టోర్నమెంట్ పోటీలో పాల్గొన్న క్రీడాకారులకు భోజన సదుపాయం కూడా కల్పిస్తామని తిరుమలరావు తెలిపారు

## వైసీపీ సీనియర్ నాయకుడు 'సనపల' మృతి



**మందస, జనవరి 8(వార్త):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సనపల ఆనందరావు ఆకస్మికంగా మరణించారు. మందస మండలంలోని సిద్ధిగాం గ్రామానికి చెందిన ఆయన పార్టీకి మంచి సేవలందించారు. కొద్దిరోజులుగా అనారోగ్యానికి గురైన ఆయన మృతి చెందారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారు. సిద్ధిగాం పంచాయతీలో పలు అభివృద్ధి పనులకు ఆయన సహకరించారు. ఆనందరావుకు భార్య విమల, కుమార్తెలు శైలజ(పంచాయతీ కార్యదర్శి), భవాని (ఫీల్డ్ అసిస్టెంట్), రాజేష్ ఉన్నారు. ఆయన మరణం తీరని లోటని సిద్ధిగాం సర్పంచ్ గున్న రమణమూర్తి అన్నారు. పార్టీలో సీనియర్ నాయకునిగా ఎంతో మంచి పాత్ర పోషించారన్నారు. వ్యక్తిగతంగా తనకు నష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనందరావు మృతిపై సంతాపం తెలిపి, ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు.

## గొల్లగండిలో జనసేన నేతల పర్యటన



**సోంపేట, జనవరి 8(వార్త):** గొల్లగండి గ్రామంలో ఇచ్ఛాపురం జనసేన పార్టీ ఇన్‌చార్జి యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాసరి రాజుతోపాటు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు బీన ప్రదీప్, పలువురు నాయకులు కలిసి గురువారం పర్యటించారు. ముఖ్యంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్న జనసైనికులను పరామర్శించారు. వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఇటీవల గొల్లగండి పంచాయతీకి మంజూరైన రోడ్లను పనులను పరిశీలించారు. గ్రామాల అభివృద్ధికి రోడ్లు ఎంతో కీలకమన్నారు. ఈ రోడ్ల అభివృద్ధికి కృషి చేసిన ఎమ్మెల్యే అశోక్, సంబంధిత అధికారులకు రాజు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలని పార్టీ శ్రేణులను కోరారు. కార్యక్రమంలో మత్స్యకార సహకార సంఘ అధ్యక్షులు గండుపల్లి చిన్న రాజారావు, బొమ్మిడి తేజ, టీడీపీ నేత రత్నాల బాబూరావు, ప్రేమ్, జన సైనికులు తదితరులు పాల్గొన్నారు.

## కిడిమి ప్రభుత్వ పాఠశాలలో వాటర్ ప్యూరిఫైయర్ ప్రారంభం



**సారవకోట, జనవరి 8(వార్త):** కిడిమి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫైయర్‌ను ఎంఈఓలు మడ్డు వెంకటరమణ, భూలక్ష్మి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛమైన తాగునీరు లేకపోవడంతో పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఈ సమస్యను గుర్తించి స్కూల్ గ్రాంట్ నిధులతో పాటు స్థానికుల సహకారంతో రూ.22,500 వ్యయంతో వాటర్ ప్యూరిఫైయర్‌ను కొనుగోలు చేసి, ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ చర్య అభినందనీయమని పేర్కొంటూ, దీనికి కృషి చేసిన ఉపాధ్యాయులను వారు ప్రత్యేకంగా ప్రశంసించారు.

## చీడిపూడిలో హోమియోపతి హాస్పిటల్‌కు శంకుస్థాపన

**సారవకోట, జనవరి 8(వార్త):** చీడిపూడిలో హోమియోపతి హాస్పిటల్ నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రూ.17 లక్షల నిధులను హాస్పిటల్ నిర్మాణానికి కేటాయించినట్లు తెలిపారు. గ్రామానికి సాయంత్రం చేరుకున్న ఎమ్మెల్యే, హాస్పిటల్ భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తూ అధికారులకు పనులు వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ హాస్పిటల్ నిర్మాణంతో చీడిపూడితో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు హోమియోపతి వైద్యం అందుబాటులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# ప్రశ్నిస్తే రౌడీషీట్లా?

**-ప్రజాస్వామ్యంపై కూటమి ప్రభుత్వం దాడి**

**-శ్రీకాకుళంలో యువజన విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ తీవ్ర విమర్శలు**



**శ్రీకాకుళం, జనవరి 8(వార్త):** రాష్ట్రంలో ప్రజా పరిపాలన సాగుతోందా? లేక 'రెడ్‌బుక్' పాలన అమలవుతోందా? అని యువజన, విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ తీవ్రంగా ప్రశ్నించింది. ప్రజాస్వామ్యబద్ధంగా సమస్యలపై ప్రశ్నిస్తున్న యువజన, విద్యార్థి నాయకులపై అక్రమ కేసులు బనాయించడం, రౌడీషీట్లు ఓపెన్ చేయడం దుర్మార్గమని వారు ఖండించారు. గురువారం శ్రీకాకుళంలోని దాసరి నాగభూషణరావు భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పూడి కిరణ్‌కుమార్, వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మార్పు పృథ్వీ, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కె.సాయికుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.చందు, వైఎస్ఆర్ విద్యార్థి విభాగం నాయకులు విజయ్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొత్స సంతోష్, నిరుద్యోగ పోరాట సమితి నాయకులు టీ.సూర్యం తదితరులు మాట్లాడారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులు, విద్యార్థులకు ఇచ్చిన 'మెగా డీఎస్సీ', 'ఉద్యోగ క్యాలెండర్, 'ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీల అమలు కోరితే కేసులు పెట్టి జైల్లో పెట్టడం ఏ విధమైన పాలన అని వారు ప్రశ్నించారు. సొంత ఆస్తులు అడగడం లేదని, ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని మాత్రమే అడుగుతున్నామన్నారు. విశాఖపట్నంలో విద్యార్థి నాయకులపై పెట్టిన అక్రమ రౌడీ షీట్లను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటూ వారిని నేరస్తులుగా చిత్రీకరించే ప్రయత్నం మానుకోవాలని హెచ్చరించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు యువజన విద్యార్థి సంఘాలపై కేసులు ఉండవని చెప్పిన లోకేష్, అధికారంలోకి రాగానే ప్రశ్నించే గొంతులను అణిచేస్తున్నారని మండిపడ్డారు. అణచివేతతో ఉద్యమాలను ఆపలేరని, ఇది ప్రజాస్వామ్య దేశమే కానీ నియంతృత్వ రాజ్యం కాదని నాయకులు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిరసనకారులపై పెట్టిన అక్రమ కేసులను వెనక్కి తీసుకోవాలని, ఎన్నికల హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వివిధ యువజన, విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజా వారి కోట సొగసు చూడతరమా..!



మంజూష సంస్థానాన్ని రాజుల ఏకఛత్రాధిపత్యంగా పరిపాలించారు. అలనాటి మంజూష నేడు మందసగా పిలువబడుతోంది. అప్పటి రాజుల పాలనకు గుర్తుగా కోట పర్యాటకులను కనువిందు చేస్తోంది. రాజావారి కోట.. రాణి కోట.. రాణి విహరించే తటాకం.. మంజూష చరిత్రకు ఆనవాళ్లుగా నేటికీ కనిపిస్తున్నాయి. రాజావారి కోట విహంగ వీక్షణం చూపరులను ఆకట్టుకుంటోంది.

-మందస

## మహిళా సంఘ దర్శినికి మంచి స్పందన





**మందస, జనవరి 8(వార్త):** మహిళా సంఘాలు నిర్వహణలో పంచసూత్రాలు ప్రకారం నెలవారీ పుస్తక నిర్వహణ రికార్డులను పరిశీలిస్తూ తగు సూచనలు ఇచ్చే ఉద్దేశంతో తలపెట్టిన సంఘదర్శిని కార్యక్రమానికి మంచి స్పందన లభించిందని వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. గురువారం బుడారసింగి గ్రామ సంఘం అధ్యక్షురాలు నల్ల సుజాత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మహిళా సంఘాల పుస్తక నిర్వహణను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ సూచన ప్రకారం మన డబ్బులు- మన లెక్కలు కార్యక్రమంలో సభ్యులందరికీ పూర్తిస్థాయిలో అన్ని ఆర్థిక లావాదేవీల పైన అవగాహన కల్పించారు. కేవలం 92పైసల వడ్డీకే ఏవిధమైన ప్రాసెసింగ్ చార్జీలు లేకుండా మహిళా సంఘాల సభ్యులకు స్త్రీనిధి ద్వారా లోన్స్ మంజూరు చేస్తున్నట్లు వివరించారు. ఇంటర్నల్ లెండింగ్‌కు వాడుకోగా మిగిలిన సేవింగ్ ఖాతాలో నిల్వలను ఫిక్స్ డ్ డిపాజిట్లు చేయించి, ఆ బాండ్లను అన్ని సంఘాలకు అందించాలని సంబంధిత క్లస్టర్ కోఆర్డినేటర్, వీ.ఓ.ఏ.లకు ఆదేశించారు. కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్ కె.రమేష్, నూతనంగా ఎంపికైన వీఓఏ మోహిని, గ్రామ సంఘం ప్రతినిధులు సుజాత, నర్మదాప్రధాన్, సరిత, రేవతి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

# గెలవాలి శ్యామ్..!

**-నీపై నమ్మకంపై ఇన్‌చార్జి బ్యాతలు అప్పగించా**

**-కూటమి ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగొట్టు**

**-సాడికి కర్తవ్య బోధ చేసిన వైసీపీ అధినేత జగన్**



**ఇచ్ఛాపురం, జనవరి 8(వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గ కన్వీనర్‌గా నియామకం జరిగిన తర్వాత తొలిసారిగా వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డిని గౌరవపూర్వకంగా శ్యాంప్రసాద్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఇచ్ఛాపురం నియోజక వర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలుపు ప్రతిష్టాత్మకమని, పార్టీని విజయం దిశగా తీసుకెళ్లాలని జగన్ శ్యామ్‌కు సూచించారు. నియోజకవర్గంలో అతి పెద్ద సామాజిక వర్గాలైన యాదవులకు ఎమ్మెల్సీ, రెడ్డికలకు సమన్వయకర్త, కాళింగులకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవులు ఇచ్చి, వైఎస్సార్ కాగ్రెస్ పార్టీ సమతూకాన్ని, సామాజిక న్యాయం పాటించిందని , తమ ముందు రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యం గా, తెలుగుదేశం కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టి ప్రజల పక్షన నిలవాలని హితబోధ చేశారు.

## మందస రైల్వే స్టేషన్ అభివృద్ధికి చేయాలి

**-ఎక్స్ ప్రెస్ రైళ్ల నిలుపుదలకు వినతి**



**మందస, జనవరి 8(వార్త):** మందస రైల్వేస్టేషన్ అభివృద్ధికి దూరంగా ఉండి ప్రయాణికులకు రైల్వే సౌకర్యాలు కరువయ్యాయని, రైల్వేస్టేషన్ అభివృద్ధికి కృషి చేయాలని పలువురు నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం వారు మందస రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ హరిగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. మందస రైల్వే స్టేషన్లో విశాఖ, ప్రశాంతి, బరంపురం-విశాఖ ఇంటర్‌సిటీ, రౌర్కెల(రాజా రాణి)రైలు, గుణుపూర్ -కటక్ రైళ్లను మందస రైల్వే స్టేషన్‌లో నిలిపేందుకు కృషి చేయాలని వినతిపత్రంలో కోరారు. పలు సమస్యలను వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని, ఖుర్దా రోడ్డు జీఆర్ఎం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ఉద్దానం గిరిజన ప్రాంతాల నుంచి, ఇతర రాష్ట్రాల, పట్టణాలకు నిత్యం ఈ ప్రాంత ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని, సుమారు 42గ్రామ పంచాయతీలకు, ప్రజలకు మందస రైల్వే స్టేషన్ అందుబాటులో ఉందని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కొత్ర ఆనందరావు, గొలుసు చంద్రశేఖర్, అనల రమణ, కొత్ర వైకుంఠరావు, జె.హరికృష్ణ, జె.అమ్మినాయుడు, కొత్ర హరినారాయణ, సాన లింగేశ్వరరావు, ఎంపీటీసీ ప్రతినిధి దున్న పురుషోత్తం, ఖుర్దా రోడ్ డివిజన్ జెడ్ఆర్సీ మెంబర్ రంగారావు రౌళో, కొత్ర రామారావు తదితరులు పాల్గొన్నారు.


## పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ



**సోంపేట, జనవరి 8(వార్త):** కంచిలి మండలం తలతంపర గ్రామంలో గురువారం తహసీల్దార్ రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో రైతులకు రాజముద్రతో ముద్రించిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేశారు. రైతుల భూముల హక్కులను కాపాడటమే లక్ష్యంగా ప్రభుత్వం కొత్తగా రాజముద్రలతో కూడిన పాసు పుస్తకాలను అందజేస్తుందన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సంతోష్‌కుమార్, టీడీపీ నేత నేత పూర్ణచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రాళ్లు తేలిన రోడ్డుతో నరకయాతన

**సారవకోట, జనవరి 8(వార్త):** కేజే పురం నుంచి టెక్కలి మండలం రంగాపురం వరకు ఉన్న రోడ్డు ప్రయాణికులకు నిత్య పరీక్షగా మారింది. పల్లె పండుగలో భాగంగా ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా, పనుల నాణ్యతపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డు పనుల సమయంలో రాళ్లు వేసి కేవలం రోలింగ్ చేసి వదిలేయడంతో, వాహనాల రాకపోకలతో రాళ్లు పూర్తిగా తేలిపోయాయి. దీంతో రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ, ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ధనంతో చేపట్టిన రోడ్డు పనులు ఇలా నాణ్యత లేకుండా పూర్తి చేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డును మళ్లీ నాణ్యంగా పునర్నిర్మించి, ప్రయాణికుల సమస్యలను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## అధ్వానంగా నువాగడ రోడ్డు



**సోంపేట, జనవరి 8(వార్త):** కంచిలి మండలం గిరిజన గ్రామమైన నువాగడ గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. జలంత్రకోట పంచాయతీ మీదుగా ఈ గ్రామానికి వెళ్లాలంటే ప్రజలకు తీవ్ర ఇబ్బందికరంగా ఉంది. ఎక్కడికక్కడ రాళ్లు తేలి, విపరీతమైన గోతులతో రాకపోకలకు తీవ్ర సమస్యగా మారింది. నువాగడ గ్రామంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాల ఉన్నందున ప్రతిరోజూ ఉపాధ్యాయులు ఆయా గ్రామాల ప్రజలు నిరంతరం ప్రయాణిస్తూ రాకపోకలు సాగిస్తుంటారు. ఇటువంటి రోడ్డును అభివృద్ధి చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆ ప్రాంతీయులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా ఈ రహదారిని బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# ఉపాధ్యాయినిలకు గౌరవం.. అభివృద్ధికి నిలయం

### -ఘనంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం



**మందస, జనవరి 8(వార్త):** మహిళా ఉపాధ్యాయులు గౌరవించబడిన చోట అభివృద్ధికి నిలయంగా మారుతుందని పలువురు వక్తలు అన్నారు. యూటీఎఫ్ వజ్రపుకొత్తూరు మండలశాఖ ఆధ్వర్యంలో నగరంపల్లిలోని ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వారోత్సవాల్లో భాగంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూటీఎఫ్ మహిళా నాయకురాలు గుంట సత్యవతి అధ్యక్షత వహించగా ఎంఈఓ-1 దాట్ల దాశరథి, ఎంఈఓ-2 బీవీ రమణ, ప్రధానోపాధ్యాయుడు టి.హేమారావు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. డాక్టర్ కొండల సుమ, డాక్టర్ మామిడి శ్రావణి విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు బల్ల చిట్టిబాబు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే చూపించిన ఆదర్శ మార్గంలో నేటి మహిళా ఉపాధ్యాయులు సేవ చేయడం గొప్ప అదృష్టంగా భావించాలని కొనియాడారు. రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావు మాట్లాడుతూ పిల్లల సున్నిత మనస్తత్వం అర్థం చేసుకోగలిగిన శక్తి మహిళా ఉపాధ్యాయులకు మెండుగా ఉంటుందన్నారు. డాక్టర్ సుమ, డాక్టర్ శ్రావణి మాట్లాడుతూ విద్య మాత్రమే అద్భుత భవిష్యత్తును, సమసమాజ స్థాపనను అందివ్వగల ఆయుధమనే విద్యను అందిస్తున్న మహిళ ఉపాధ్యాయులు గొప్ప సంఘ సేవకులన్నారు. ఇంత చక్కటి కార్యక్రమం నిర్వహించిన యూటీఎఫ్‌ను అభినందించారు. అనంతరం అతిథులు.. 40 మంది మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రత్నాల సురేష్, చౌక్కర ధర్మారావు, సీనియర్ నాయకులు గున్న మధు, కంచరాన జయరాం, మహిళా కార్యదర్శి బొత్స శోభారాణి, గూన వేదవతి, గున్న జయప్రద, ఆర్.స్వర్ణలత, యూటీఎఫ్ మండల నాయకులు ధనుంజయరావు, శశిభూషణరావు, సింహాచలం, శరత్‌కుమార్, అంజన్‌కుమార్, సుందరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పలాస జాతీయ రహదారిపై జీడి పిక్కల వ్యాన్ బోల్తా



**పలాస, జనవరి 8(వార్త):** పలాస జాతీయ రహదారిలో మొగిలిపాడు దగ్గర గురువారం రోడ్డు ప్రమాదం సంభవించింది. సోంపేట మండలం కొర్లాం నుంచి టెక్కలి వైపు జీడిపిక్కల లోడుతో వెళ్తున్న లగేజీ వ్యాను మొగులపాడు జాతీయ రహదారిపై అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ గాయాలు కాగా, జీడి పిక్కలు బస్తాలు చెల్లా చెదురయ్యాయి. స్థానికులు ఈ విషయాన్ని గమనించి క్షతగాత్రుడ్ని పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. దీంతో పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి క్షతగాత్రుడ్ని వైద్య సేవలందించారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సముద్రపు నాచు మొక్కల పరిశీలన



**పలాస, జనవరి 8 (వార్త):** ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాలతో సోంపేట మండలం ఎన్ఎఫ్ డీబీ ఆధ్వర్యంలో (సీ వీడ్) సముద్రపు నాచు మొక్కల పంటను గురువారం కూటమి నాయకులు పరిశీలించారు. ఈ (సీ వీడ్) సముద్రపు నాచు మొక్కలు తీర ప్రాంతంలో ఎక్కువ సాగు చేయడానికి, ప్రభుత్వం మరింత అవగాహన కల్పిస్తూ, దీని ఫిషింగ్ సామగ్రికి 100 % సబ్సిడీతో అండగా ఉండాలని, మత్స్యకారులకు ఆర్థికంగా ఎదగడానికి మరింతగా కృషి చేయాలని జిల్లా మత్స్యకార ప్రతినిధి గోవిందు పాపారావు కోరారు. తుఫానులు, వరదల నుంచి తీరాలను రక్షిస్తాయని, సుందర్‌బన్స్‌లో 16 మిలియన్ మొక్కలు పెంచి బయో-షీల్డ్‌గా పనిచేశాయని, కార్బన్ ఉద్గారాలు తగ్గించి, నీటి శుద్ధి, జీవవైవిధ్యం పెంచుతాయని, హెక్టారుకు ₹2,000-9,000 విలువ. చేపల బ్రీడింగ్ గ్రౌండ్‌గా మత్స్య ఉత్పత్తి మెరుగుపరుస్తాయని తెలిపారు.

## మెట్టపేటలో జెమ్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



**పోలాకి, జనవరి 8 (వార్త):** పల్లిపేట పంచాయతీ పరిధిలోని మెట్టపేట గ్రామంలో జెమ్స్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ క్యాంప్‌కు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తార రామకృష్ణ గారు, దామోదర్ గారు, బీజేపీ నాయకులు ఎండ శ్రీనివాసరావు గారు పాల్గొని క్యాంప్‌ను పరిశీలించారు. వైద్యులు గ్రామస్థులకు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన సూచనలు అందించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని క్యాంప్ సేవలను వినియోగించుకున్నారు. ఇలాంటి వైద్య శిబిరాలు గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడంలో ఎంతో ఉపయోగపడతాయని నాయకులు అభిప్రాయపడ్డారు.

## ధాన్యం నిల్వలపై జేసీ ఆకస్మిక తనిఖీ

**జలుమూరు/ సారవకోట, జనవరి 8(వార్త):** జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ గురువారం జలుమూరు, సారవకోట మండలాల్లో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. జలుమూరు మండలం అల్లాడలోని రైతు సేవా కేంద్రాన్ని సందర్శించిన ఆయన, ధాన్యం కొనుగోలు ప్రక్రియను, రైతులకు అందుతున్న సదుపాయాలను పర్యవేక్షించారు. అనంతరం సారవకోట మండలంలోని శ్రీ రాజరాజేశ్వరి మోడ్రన్ ధాన్యం మిల్లును తనిఖీ చేసి, అక్కడ ఉన్న నిల్వలు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ధాన్యం సేకరణలో పారదర్శకత పాటించాలని, నిబంధనల ప్రకారం మిల్లింగ్ ప్రక్రియ సాగాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఈ సందర్భంగా ఆయన అధికారులను, మిల్లు యాజమాన్యాలను ఆదేశించారు.

# ఇష్టపడి చదివితే లక్ష్యాన్ని సాధించగలరు

### -మెళియాపుట్టి ఎంఈవోలు దేవేంద్ర, పద్మనాభం -ఎల్వి చలం సౌజన్యంతో టెస్ట్ పేపర్ల పంపిణీ



**మెళియాపుట్టి, జనవరి 8(వార్త):** విద్యార్థులు తమ విద్యార్జన సమయంలో చదువుపై మక్కువ పెంచుకొని, ఇష్టపడి చదవగలిగిన నాడు వారు అనుకున్న లక్ష్యాన్ని సాధించి, ఉన్నత శిఖరాలను అధిరోహించి పదిమందికి ఆదర్శం కాగలరని మండల విద్యాశాఖధికారులు దేవేందర రావు, పద్మనాభం అన్నారు. గురువారం కరజాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు టివి రమణ అధ్యక్షతన జరిగిన పేరెంట్స్ సమావేశంతో పాటు 10వ తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ నమూనా ప్రశ్నావళిని పంపిణీ చేసే కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖధికారులతో పాటు ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు పలువురు మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాలలో నేర్పిన బోధన అంశాల విషయాల్ని విద్యార్థులు క్రమశిక్షణతో అభ్యసించాలని అందుకు తల్లిదండ్రులు ఇంటి వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంగ్లీషు ఉపాధ్యాయులు ఎల్‌ఎవీ చలం..41 మంది పదో తరగతి విద్యార్థులకు టెస్ట్ పేపర్లును పంపిణీ చేయడంపై అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచ్ బమ్మిడి పున్నయ్య, ఎంపీటీసీ సభ్యులు దాసరి రవికుమార్, తెలుగుదేశం నాయకులు హనుమంతు చంద్రశేఖర్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ జోగ హేమలత, ఉపాధ్యాయులు కె.శ్రీరాములు టి.గోపాలకృష్ణ, సీహెచ్ ఆదినారాయణ, పి.రామారావు, యతి రాజారావు, యస్.దాసు, డి.దీనబంధు, సింహాచలం, పుష్ప, కిరణ్, నారాయణ, ప్రమీల, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### రెడ్డికకు సమన్వయకర్త పదవితో ..

# సామాజిక సమతుల్యం

### ఇచ్ఛాపురం నియోజకవర్గ వైస్సార్సీపీ యూత్ అధ్యక్షుడు నర్తు ప్రేమ్‌కుమార్ యాదవ్



**ఇచ్ఛాపురం, జనవరి 8(వార్త):** ఉన్నత ఉద్యోగానికి రాజీనామా చేసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరి ప్రజలకు, పార్టీకి సేవలందించిన సాడి శ్యాంప్రసాద్ రెడ్డిని ఇచ్ఛాపురం నియోజకవర్గం సమన్వయకర్తగా నియమించడంపై నియోజకవర్గ వైస్సార్సీపీ యూత్ అధ్యక్షుడు నర్తు ప్రేమ్ కుమార్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం కాంగ్రెస్ పార్టీకి ఇతోధికంగా మంచి మేలు చేయగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజకీయ కుటుంబ నేపథ్యం కలిగిన శ్యాంప్రసాద్ రెడ్డి పార్టీని సమర్థవంతంగా నడిపించగలరని విశ్వాసంతో పార్టీ శ్రేణులున్నారని తెలిపారు. ఇచ్ఛాపురంలో గెలుపు లక్ష్యాన్ని పార్టీ కచ్చితంగా చేరుకోలగలదన్నారు. శ్యాంప్రసాద్ రెడ్డి నాయకత్వంలో ద్విగుణీకృత ఉత్సాహంతో పనిచేసి రానున్న శాసనసభ ఎన్నికలలో ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేని జగన్మోహన్ రెడ్డికి కానుకగా ఇవ్వగలమన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం సీనియర్ నాయకుడు, మాజీ శాసనసభ్యుడు పిరియా సాయిరాజ్‌కి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యనిర్వాహక కమిటీ (సీఈసీ సభ్యనిగా నియమించినందుకు హర్షామోదాన్ని తెలియజేశారు. ఈ నియామకాలకు సహకరించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కన్వీనర్ సజ్జల రామకృష్ణారెడ్డి, శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమన్వయకర్త కురసాల కన్నబాబు, జిల్లా ఇన్‌చార్జి కుంబా రవిబాబు, జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాసు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఇచ్ఛాపురం నియోజకవర్గ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దుంపల లక్ష్మణరావుకి ధన్యవాదాలు తెలిపారు.

## నూనె గింజలు, నువ్వుల పంటపై శాస్త్రీయ అవగాహన




**కొత్తూరు, జనవరి 8(వార్త):** కొత్తూరు మండలం గొట్టిపల్లి పంచాయతీలో శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో నూనె గింజలు, నువ్వుల పంట సాగుపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక సర్పంచ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తులసీ వర ప్రసాదరావు మాట్లాడుతూ, మారుమూల గిరిజన ప్రాంతాల్లో రైతులు సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ సదస్సులో భాగంగా శాస్త్రవేత్తలు రైతులకు పలు కీలక సూచనలు అందించారు. అధిక దిగుబడి కోసం పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. జీడి, మామిడి తోటలు పూత, పిందెలు రాలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నాణ్యమైన దిగుబడి కోసం అనుసరించాల్సిన చిట్కాలను వివరించారు. అనంతరం, లోతుగెడ్డ తులసీ వర ప్రసాదరావు.. రైతులకు నువ్వుల విత్తనాలు, కలుపు తీసే యంత్రాలు, స్ప్రే మిషన్లను పంపిణీ చేశారు. ఆధునిక పరికరాలను ఉపయోగించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని ఆయన కోరారు.

కార్యక్రమంలో శాస్త్రవేత్త వెంకట్రావు, వ్యవసాయ అధికారులు రేణుక, సుమంత్, రాజగోపాల్, సర్పంచ్‌లు కోయిలాపు శ్రీనివాసరావు, సవర ఫల్గుణ రావు ఇతర ప్రజా ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## మఖరజోల వద్ద రెండు వాహనాల ఢీ

### -వ్యాన్ డ్రైవర్ కు గాయాలు



**మందస, జనవరి 8(వార్త):** మఖరజోల వద్ద జాతీయ రహదారిపై గురువారం రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ గాయాల పాలయ్యాడు. శ్రీకాకుళం నుంచి సోంపేట వైపు వెళ్లే జాతీయ రహదారిలో మఖరజోల సమీపంలో మొక్కలకు వేస్తున్న ఎన్.హెచ్.ఏ.ఐ. వాటర్ ట్యాంకర్ లారీకు.. అదే రహదారిపై వెళ్తున్న ఐషర్ వ్యాన్‌కు ఓ లారీ అతి వేగంతో వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో ఐషర్ వ్యాన్ నియంత్రణ కోల్పోయి హైవే వాటర్ ట్యాంకర్ లారీని వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ సంఘటనలో వ్యాన్ డ్రైవర్ గాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో వైద్యం నిమిత్తం హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

## మందుల వర్తక సంఘ కార్యవర్గం ఏకగ్రీవం

**ఇచ్ఛాపురం, జనవరి 8(వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోగల మందుల వర్తకుల సంఘం సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. మత్తు మందుల అమ్మకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అనుభవజ్ఞులైన సభ్యులతో అవగాహన కల్పించారు. అనంతరం సంఘ నూతన కార్యవర్గానికి అధ్యక్షునిగా రంగాల జానకిరామ్ రెడ్డి (జానీ), కార్యదర్శిగా ప్రత్తి రాజ్‌కుమార్, కోశాధికారిగా సుధీర్‌కుమార్ రౌళో, ఉపాధ్యక్ష, సహ కార్యదర్శిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి రాష్ట్ర మందుల వర్తకుల సంఘం ప్రధాన కార్యదర్శి , శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు కె కరుణ్ కుమార్ గుప్తా, జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి వైశ్యరాజు మణిరాజు, కోశాధికారి కె.మురళి, శ్రీకాకుళం జోన్ ఇన్‌చార్జి శ్రీనివాసరావు, టెక్కలి జోన్ ఇన్‌చార్జి అశోక్, పలాస-కాశీబుగ్గ, సోంపేట మందుల వర్తకుల సంఘం సభ్యులు అభినందనలు తెలిపారు.

## సీసీ రోడ్లను పరిశీలించిన నాయకులు



**పలాస, జనవరి 8 (వార్త):** ఏ ప్రాంతమైన అభివృద్ధి చెందాలంటే రహదారులతోనే సాధ్యమని పలువురు నాయకులు వెల్లడించారు. పలాస మున్సిపాలిటీ పారసంబలో సీసీ రోడ్డు పనులు ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఎస్సీ వీధిలోరూ. 2.8లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను మునిసిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందాలంటే ఏ ప్రాంతమైనా మొదట రహదారుల అభివృద్ధి అవసరమన్నారు. రహదారులు రవాణా సౌలభ్యాన్ని పెంచి, ఆర్థిక, సామాజిక పురోగతికి ఆధారం విస్తరిస్తాయని తెలిపారు. రహదారులు మారుమూల ప్రాంతాలను ప్రధాన కేంద్రాలతో అనుసంధానం చేస్తూ, వ్యవసాయం, వాణిజ్యం, ఉపాధి అవకాశాలను పెంచుతాయన్నారు. గ్రామీణ ఆదాయాలు, జీవన నాణ్యతను మెరుగు పరుస్తున్నాయని చెప్పారు. సీసీ రోడ్డు నిర్మాణంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం జగన్‌తో జయప్రకాష్ రెడ్డి భేటీ



**ఇచ్ఛాపురం, జనవరి 8(వార్త):** మాజీ ముఖ్యమంత్రి, వైస్సార్సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డితో వైస్సార్సీపీ సింగపూర్ ఎన్ఆర్ఐ విభాగం ప్రతినిధి దక్కత జయప్రకాష్ రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తాడేపల్లిలో కేంద్ర పార్టీ కార్యాలయంలో కలిసి ఇచ్ఛాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా సాడి శ్యాం ప్రసాద్ రెడ్డిని నియమించడంపై ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ సమస్యలపై చర్చించారు.

## పర్యావరణ పరిరక్షణే ఎన్ఎస్ఎస్ వలంటీర్ల లక్ష్యం

**పలాస, జనవరి 8(వార్త):** పర్యావరణ పరిరక్షణే ఎన్ఎస్ఎస్ వలంటీర్ల లక్ష్యంగా పని చేయాలని పలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి అన్నారు. గురువారం పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో సున్నాడాలోని మండల ప్రజా మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రాంగణంలో వారం రోజులపాటు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ కార్యక్రమం చివర రోజైన ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల ప్రాముఖ్యతను వివరించి, పరిశుభ్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, విద్యపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలిసి విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పి.మధు, కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి.వెంకటరమణ, లైబ్రేరియన్ నరసింహులు, డాక్టర్ వై.వెంకటలక్ష్మి (హిందీ లెక్చరర్), ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ క్లర్క్ సురేష్, తుంబేశ్వరరావు, గౌతమి, విద్యార్థులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## రికార్డు సహాయకులుగా నలుగురికి పదోన్నతి

**శ్రీకాకుళం, జనవరి 8 (వార్త):** జిల్లా పరిషత్ పరిధిలోని వివిధ కార్యాలయాలు, ఉన్నత పాఠశాలల్లో ఆఫీస్ సబార్డినేట్లుగా పనిచేస్తున్న నలుగురు ఉద్యోగులకు రికార్డు సహాయకులుగా పదోన్నతి కల్పిస్తూ జెడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ గురువారం నియామక పత్రాలు అందజేశారు. తన అధికారిక నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్.జ్యోతికుమారి (అమలపాడు), కె.పావని (బ్రాహ్మణతర్ల), హెచ్.శాంతిలక్ష్మ (బోరుభద్ర), కె.ప్రసాదరావు (గొప్పిలి)లకు పదోన్నతి ఉత్తర్వులను అందజేస్తూ వారిని ఆయా పాఠశాలలకు కేటాయించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఉద్యోగులకు పెద్దపీట వేస్తూ అధిక సంఖ్యలో పదోన్నతులు కల్పించడం తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని పేర్కొన్నారు. పదోన్నతి పొందిన వారు నూతన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించి శాఖ ఔన్నత్యాన్ని పెంచాలని ఆమె ఆకాంక్షంచారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ డి.సత్యనారాయణ, సి-సెక్షన్ ఏఓ, సిబ్బంది పాల్గొన్నారు.





# రైతు పక్షపాతి.. రవన్న

✻ అచ్చన్నపేట రైతుల 'భూ' కష్టాలకు విముక్తి ✻ ఎమ్మెల్యే కూన రవికుమార్ చొరవ ✻ ముగిసిన పదేళ్ల నిరీక్షణ ✻ డిజిటల్ సంతకాల పునరుద్ధరణకు జాయింట్ కలెక్టర్ ఉత్తర్వులు ✻ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేసిన అచ్చన్నపేట రైతులు

**శ్రీకాకుళం, జనవరి 8 (వార్త):** కర్షకుని కష్టం తెలిసిన రైతు బిడ్డ.. రాష్ట్ర పీయూసీ చైర్మన్.. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్. రైతుల కష్టాలను తమ కష్టాలుగా భావించి వాటి పరిష్కారానికి ఎంతవరకైనా పోరాడే వ్యక్తి. ఆ సమస్య ఎంత పెద్దదైనా దాన్ని క్షుణ్ణంగా అవగాహన చేసుకుని ఎలా అయితే పరిష్కారం అవుతుందో.. ఆ మార్గంలో వెళ్లే రైతు బాంధవుడు. పదేళ్లుగా ఆమదాలవలస మండలం అచ్చన్నపేట రెవెన్యూ గ్రామ రైతులను వేధిస్తున్న భూ సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించేలా ఎమ్మెల్యే కృషి చేసి అభినందనీయం. అచ్చన్నపేట రెవెన్యూ పరిధిలోని రైతుల భూములకు సంబంధించి వెబ్ ల్యాండ్ పోర్టల్లో నిలిపివేసిన తహసీల్దార్ డిజిటల్ సంతకాన్ని పునరుద్ధరిస్తూ శ్రీకాకుళం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రత్యేక చొరవతో ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో రైతన్నల కళ్లలో ఆనందం వెల్లివిరిసింది. గత పదేళ్లుగా అచ్చన్నపేట గ్రామంలోని సుమారు 47.66 ఎకరాల జిరాయితీ భూములకు సంబంధించి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2015లో నాటి రెవెన్యూ అధికారులు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండానే ఈ భూములను 'ఇనాం' భూములుగా పేర్కొంటూ వెబ్ ల్యాండ్ పోర్టల్లో తహసీల్దార్ డిజిటల్ సంతకాలను నిలిపివేశారు. దీనివల్ల రైతులకు అడంగల్, 1బి వంటి పత్రాలు అందక, బ్యాంకు రుణాలు పొందేందుకు, రైతు భరోసా వంటి ప్రభుత్వ పథకాలు అందుకోవడానికి వీలు లేకుండా పోయింది.

### ఎమ్మెల్యే చొరవతో కదిలిన యంత్రాంగం

ఈ సమస్యను స్థానిక రైతులు ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన దీనిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. రెవెన్యూ అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించేలా ఒత్తిడి తెచ్చారు. తహసీల్దార్ నివేదిక ప్రకారం.. 1958-59 కాలంలోనే రైతుల పూర్వీకులు ఇనాందార్ల నుంచి ఈ భూములను రిజిస్టర్డ్ డాక్యుమెంట్ల ద్వారా కొనుగోలు చేసినట్లు నిర్ధారణ అయింది. దాదాపు 16.49 ఎకరాల విస్తీర్ణానికి సంబంధించి పక్కా ఆధారాలు ఉండటంతో, జాయింట్ కలెక్టర్ ఈ సమస్యను పరిష్కరిస్తూ సానుకూల ఉత్తర్వులు ఇచ్చారు. రాజకీయాలకు, వర్గాలకు తావు లేకుండా కేవలం ప్రజా సమస్యలే పరమావధిగా పనిచేస్తున్న కూన రవికుమార్ కి ఈ సందర్భంగా స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఏళ్ల తరబడి రైతులను ఊరించిన 22- ఏ భూముల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే చూపిన ఉక్కు సంకల్పం గ్రామస్తుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని కొనియాడారు.




## డ్రగ్స్ వద్దంటూ చింతాడలో విద్యార్థుల ర్యాలీ

**శ్రీకాకుళం, జనవరి 8 (వార్త):** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు పిలుపునిచ్చారు. గురువారం చింతాడ గ్రామంలో 'నేషనల్ యూత్ డే' వారోత్సవాలను పురస్కరించుకుని కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ.. నేటి తరం యువతను డ్రగ్స్ మహమ్మారి దారి మళ్లిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లమందు, హెరాయిన్, గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలకు బానిసలై చిన్న వయసులోనే ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నారని హెచ్చరించారు. ముఖ్యంగా ఒత్తిడిని తట్టుకోలేని సున్నిత మనస్కులు వీటి బారిన పడుతున్నారని, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "డ్రగ్స్ కాదు - కలలు సాధించు" అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. అనంతరం చింతాడ గ్రామంలో విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. "డ్రగ్స్ వద్దు - ఆరోగ్యం ముద్దు" అంటూ విద్యార్థులు చేసిన నినాదాలు గ్రామ వీధుల్లో మారుమోగాయి. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని న్యాయమూర్తి కోరారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య కళాశాల ప్రిన్సిపల్ ఎన్.వి.వి. వేణుగోపాల్, ఆర్. రాజారావు, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళా డిగ్రీ కళాశాల ఫలితాలు విడుదల

**శ్రీకాకుళం, జనవరి 8 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ మహిళా (స్వయం ప్రతిపత్తి) కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మూడవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సూర్యచంద్రరావు, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ టి. ఆదిలక్ష్మితో కలిసి ఫలితాల వివరాలను వెల్లడించారు. ఈ ఫలితాల్లో విద్యార్థినులు మెరుగైన ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. బి.ఎస్సీ (ఆనర్స్): 81.32 శాతం, బి.ఏ (ఆనర్స్) 70.15 శాతం, బి.కాం (ఆనర్స్) 61.15 శాతంగా ఉత్తీర్ణత శాతం ఉంది. మెరుగైన ఫలితాలు సాధించేలా విద్యార్థినులను తీర్చిదిద్దిన అధ్యాపక బృందాన్ని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అభినందించారు. రాబోయే రోజుల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా మరింత పట్టుదలతో కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. చిన్నారావు, అకడమిక్ కోఆర్డినేటర్ కె. మౌనిక, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. పద్మావతి, డిప్యూటీ కంట్రోలర్స్ పి.ఎస్. కనకదుర్గ, వై. ప్రశాంతి పాల్గొన్నారు. అలాగే డేటా ఎంట్రీ ఆపరేటర్లు పి. సంతోష్, జి. శశికాంత్, బి. శ్రావణి, బోధన, బోధనేతర సిబ్బంది ఈ ఫలితాల విడుదల కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

## సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

**శ్రీకాకుళం, జనవరి 8 (వార్త):** సంక్రాంతి పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల సౌకర్యార్థం ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా అధికారి సి.హెచ్. అప్పలనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు విజయవాడ నుంచి శ్రీకాకుళం, టెక్కలి, పలాసలకు ఆన్లైన్ రిజర్వేషన్ సౌకర్యంతో 25 ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని, రైళ్లలో విశాఖ చేరుకునే వారి కోసం అక్కడి నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు అదనపు సర్వీసులు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఈ ప్రత్యేక బస్సుల్లో ఎటువంటి అదనపు చార్జీలు వసూలు చేయకుండా సాధారణ ధరలకే ప్రయాణించే అవకాశం కల్పించామని ఆయన స్పష్టం చేశారు. ప్రయాణికుల కోసం బస్టాండ్లలో 24 గంటల పారిశుద్ధ్యం, సురక్షిత తాగునీరు, తల్లుల కోసం ప్రత్యేక పాలిచ్చే గదులను ఏర్పాటు చేశామని, ఈ సౌకర్యాలను ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## పలాసను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

**పలాస, జనవరి 8 (వార్త):** పలాసను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని పలాస జిల్లా సాధన కమిటీ కన్వీనర్, ప్రముఖ న్యాయవాది, సామాజికవేత్త దువ్వాడ శ్రీధర్ (బాబా) డిమాండ్ చేశారు. పలాసలో విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడిచినా అన్యాయం ఇంకా కొనసాగుతూనే ఉందని, ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం ప్రజలకైతే వంశధార నీరు ఇప్పటికీ వాస్తవం కాదు, అది ఒక భంగపడ్డ హామీ మాత్రమేనని, ఇది యాదృచ్ఛికంగా జరిగిన వైఫల్యం కాదని, ఇది వ్యవస్థాపక నిర్లక్ష్యం, రాజకీయ ఉదాసీనతకు నిదర్శనమని పేర్కొన్నారు. పలాస జిల్లా ఏర్పడనంత వరకూ వంశధార జలాల అమలు ఉండదని, వంశధార అంశం ప్రభుత్వ అజెండాలో చివరి స్థానంలోనే మిగిలిపోతుందని ఆవేద వ్యక్తం చేశారు. శ్రీకాకుళం, పలాస రెండు వేర్వేరు జిల్లాలుగా ఏర్పడితేనే ఉత్తర శ్రీకాకుళానికి నిజమైన అభివృద్ధి చేరుతుందని తెలిపారు. ప్రభుత్వ నిధులు పెరుగుతాయని, పరిపాలనా దృష్టి మెరుగుపడుతుందని, శాశ్వత అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు. ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం, టెక్కలి నియోజకవర్గాలు ఇంతకాలం అభివృద్ధిలో వెనుకబడటానికి 'చివరి నియోజకవర్గాలు'గా చూడడమేనని అన్నారు. ఇది విధి కాదని, ఇది అన్యాయమని, పలాస జిల్లా ఏర్పాటు జరిగితేనే ఈ పరిస్థితి మారుతుందని తెలిపారు. అప్పుడే వంశధార నీరు చివరి అంచు వరకూ చేరుతుందని, లేకపోతే ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట పలాస, మందస, వజ్రపుకొత్తూరు, నందిగాం, టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, మెలియాపుట్టి తదితర మండలాలు నిరంతరం పక్కకు నెట్టివేయబడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వంశధార నీరు రాజకీయ నినాదం కాదు, అది రైతు హక్కుని, అది రాజ్యాంగబద్ధమైన న్యాయమని అన్నారు. పలాస జిల్లా ఏర్పాటుతోనే న్యాయం సాధ్యమవుతుందని, పలాస జిల్లా లేకపోతే వంశధార నీరు లేదని, పలాస జిల్లా ఉంటేనే వంశధార నీరు వస్తుందని బాబా స్పష్టం చేశారు.

## పార్టీ కార్యక్రమాల్లో కార్యకర్తలు భాగస్వాములు కావాలి

✻ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టా ప్రసాద్

✻ జిల్లా విస్తృత విస్తృత స్థాయి పదాధికారుల సమావేశం

**శ్రీకాకుళం, జనవరి 8(వార్త):** శ్రీకాకుళం నారాయణ నర్సింగ్ కాలేజ్లో బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా విస్తృత స్థాయి పదాధికారుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర జోనల్ ఇంచార్జ్ మట్టా ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. రానున్న రోజుల్లో పార్టీ సంస్థాగతం, పార్టీ చేపట్టనున్న కార్యక్రమాల్లో కార్యకర్తలందరినీ భాగస్వాములను చేయాలన్నారు. పార్టీ భావజాలాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పైడి వేణుగోపాల్, రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవిబాబ్జి, సెవ్వనా ఉమామహేశ్వరీ, పూర్వ జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు చింతు పాపారావు, పేడాడ సూరపునాయుడు, బీజేపీ నాయకులు పోకతోట సింహాచలం, జిల్లా పదాధికారులు, వివిధ మోర్చాల నాయకులు, మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## 'రథసప్తమి'కి నేడు అంకురార్పణ

✻ 46 నిమిషాల పాటు సామూహిక సూర్యనమస్కారాలు ✻ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయాధికారులు ✻ వేడుకలకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఎస్పీ పరిశీలన

**శ్రీకాకుళం, జనవరి 8(వార్త):** అరసవల్లి సూర్యనారాయణ స్వామి క్షేత్రంలో జరగనున్న రథసప్తమి వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 8 గంటలకు అత్యంత వైభవంగా అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ సందర్భంగా సుమారు 46 నిమిషాల పాటు సామూహిక సూర్యనమస్కారాలు, యోగాసనాల ప్రదర్శన ఉంటుందని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో జ్యోతి ప్రజ్వలనతో ఈ వేడుకలు మొదలుకానున్నాయి. ఈ అంకురార్పణ కార్యక్రమం ఉదయం 8 గంటలకు ప్రారంభమై 8:46 గంటల వరకు సాగుతుంది. తొలుత 5 నిమిషాల వార్మప్ అనంతరం, 18 నిమిషాల పాటు 12 రౌండ్ల సూర్యనమస్కార ఆసనాలను ప్రదర్శిస్తారు. ఆ తర్వాత అమృతాసనం, ప్రాణాయామం, ధ్యానం నిర్వహించి చివరగా శాంతి మంత్రంతో కార్యక్రమాన్ని ముగిస్తారు. ఈ వేడుక కోసం 200 మందికి పైగా వాలంటీర్లు, విద్యార్థులతో సమన్వయ సూర్యనమస్కారాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. భక్తుల సందర్శనార్థం వేదిక వద్ద ఏర్పాట్లు చేశారు రాష్ట్ర పండుగగా జరుగుతున్న ఈ ఉత్సవాల పర్యవేక్షణకు కలెక్టర్ ఇప్పటికే 15 ప్రత్యేక కమిటీలను నియమించారు. కర్టెన్ రైజర్ బాధ్యతలను ఆర్డీవో సాయి ప్రత్యూష, డీఐపీఆర్వో చెన్నకేశవరావు, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ మధుసూదన రావుతో కూడిన కమిటీ చూస్తోంది. మెగా సూర్యనమస్కారాల బాధ్యతలను ఆయుష్ వైద్యాధికారి, యోగా గురువు మురళీకృష్ణ పర్యవేక్షిస్తున్నారు. గురువారం సాయంత్రం ఆర్డీవో సాయి ప్రత్యూష, ఆలయ ఈఓ, ఇతర జిల్లా స్థాయి అధికారులు అంకురార్పణ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాటును అరసవెల్లి ఆలయ ప్రాంగణంలో పర్యవేక్షించారు.

### రథసప్తమి వేడుకల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు

అరసవిల్లి రథసప్తమి వేడుకలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా, శాంతియుతంగా నిర్వహించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా ఎస్పీ సంబంధిత అధికారులతో కలిసి వేడుకలు జరగనున్న పరిసర ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల మళ్లింపు, ప్రసాద విక్రయాలు కౌంటర్లు ఏర్పాట్లను 80 అడుగులు రహదారి, మిల్లు జంక్షన్, ఆలయ ప్రధాన రోడ్డు మార్గాలు, పరిసరాల్లో పార్కింగ్నకు అనుకూలంగా ఉండే ప్రదేశాలను క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఆలయ పరిసర ప్రాంతాలు, ప్రధాన రహదారులు, భక్తుల రాకపోకలకు అనువైన మార్గాలు, వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, వీఐపీలు వచ్చే రహదారి మార్గాలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల మళ్లింపు ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా రద్దీ నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే, ఆలయ పరిసరాల్లో ప్రసాదం విక్రయాల కోసం ఏర్పాటు చేయనున్న కౌంటర్లు, భక్తులు పాదరక్షలు ఉంచుకునేందుకు ప్రత్యేకంగా కేటాయించిన స్థలాలు, క్యూలైన్ నిర్వహణ, భక్తుల సౌకర్యాలపై కూడా జిల్లా ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా, రద్దీ ఏర్పడకుండా స్పష్టమైన ప్రణాళికతో నిర్వహించాలని సూచించారు. ప్రధాన మార్గాల్లో వాహనాల ప్రవేశాన్ని నియంత్రిస్తూ అవసరమైన చోట్ల వాహనాలను మళ్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, పార్కింగ్ ప్రదేశాల వద్ద తగిన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. అత్యవసర సేవల వాహనాలకు ప్రత్యేక మార్గాలు, కేటాయించాలన్నారు. అదేవిధంగా, సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ నిఘా ద్వారా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూభక్తులకు అవసరమైన మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో శ్రీకాకుళం ఆర్డీఓ సాయి ప్రత్యూష, శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ వివేకానంద, ఎం.హెచ్.ఓ.(మున్సిపల్ ) సుధీర్, శ్రీకాకుళం రూరల్, రెండువ పట్టణ, ట్రాఫిక్, సీసీఎస్ సీఐలు పైడిపు నాయుడు , ఈశ్వర రావు, రామారావు, సూర్య చంద్ర మౌళి, సంబంధిత పోలీసు అధికారులు, ట్రాఫిక్ అధికారులు, రెవెన్యూ, ఆలయ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ క్రీడల ఉన్నతికి అరవై కోట్లు మంజూరు

✻ పాత్రునివలసలో ఇండోర్ హాల్ నిర్మాణానికి 14 కోట్లు

✻ ఫలించిన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చొరవ

✻ ఈనెల ఆరో తేదీన క్రీడా శాఖామంత్రి మన్సుఖ్ మాండవీయతో భేటీ

✻ ఏపీలో పరిస్థితులు, కేంద్రం అందించాల్సిన నిధుల గురించి ప్రత్యేక చర్చ

✻ ఖేలో ఇండియా నుండి నిధుల కేటాయింపుపై హర్షం



**శ్రీకాకుళం, జనవరి 8(వార్త):** ఆంధ్రప్రదేశ్ లో క్రీడాకారులు, క్రీడాభిమానులు ఎప్పటి నుండో ఎదురు చూస్తున్న పలు కీలక అంశాలకు సంబంధించి కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వ శాఖ పరిధి ఖేలో ఇండియా పథకం నుండి నిధులు మంజూరు అయ్యాయి. తాజాగా ఈ నెల ఆరవ తేదిన రాష్ట్రంలో క్రీడా వసతులకు సంబంధించిన పరిస్థితులు, అందించాల్సిన ఆవశ్యకతను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.. కేంద్ర క్రీడా శాఖామంత్రి మన్సుఖ్ మాండవీయకు వివరించారు. వారి భేటి అనంతరం గురువారం నాడు నిధుల మంజూరుకు సంబంధించి ఉత్తర్వులు విడుదల అవ్వడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. మొత్తంగా అరవై కోట్ల డబ్బై ఆరు లక్షల రూపాయలు మంజూరు అయ్యాయి. ఇందులో శ్రీకాకుళం రూరల్ మండలం, పాత్రునివలసలో ఇండోర్ హాల్ నిర్మాణం కొరకు 14 కోట్లు, చిత్తూరు జిల్లా కుప్పం లో బహుళ ప్రయోజన భవన సముదాయం నిర్మాణం కొరకు 14 కోట్లు, రాజమండ్రి పరిధిలో బహుళ ప్రయోజన ఇండోర్ స్టేడియం నిర్మాణం కొరకు 13.76 కోట్లు, విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం లో ఎనిమిది లైన్ల సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణం 9 కోట్ల ఏభై లక్షలు, అదే మైదానంలో ఆర్టిఫిషియల్ గ్రాస్ ఫుట్ బాల్ ఫీల్డ్ నిర్మాణం కోసం 6 కోట్ల రూపాయలు, అదే మైదానంలో టెన్నిస్ కోర్టు నిర్మాణం కోసం కోటి ఏభై లక్షల రూపాయలతో పాటు బాస్కెట్ బాల్ కోర్టు నిర్మాణం కోసం 92 లక్షలు మంజూరు అయ్యాయి. ఇందిరా గాంధి మున్సిపల్ స్టేడియంలో ఫ్లడ్ లైట్ల ఏర్పాటు, 200 మీటర్ల ట్రాక్, ఇతర వసతుల కోసం ఒక కోటి ఎనిమిది లక్షల రూపాయల నిధులు మంజూరు అయ్యాయి. వీటితో పాటు గుంటూరు లో మైదానం నిర్మాణం కొరకు నిధుల మంజూరుకు వినతి ను రాష్ట్ర ప్రభుత్వం కోరగా.. అందులో మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ కోసం 14కోట్లు మంజూరు చేస్తామని, సవరించిన ప్రతిపాదనలు పంపాలని కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఈ ఉత్తర్వులలో పేర్కొంది. తాజా నిధుల కేటాయింపు తో ఆంధ్రప్రదేశ్ లో క్రీడాకారులు, క్రీడాభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నాళ్ళుగానో ఎదురు చూస్తున్న అనేక ప్రాజెక్టులు.. తాజా నిధుల కేటాయింపుతో నిర్మాణం దిశగా వేగం పుంజుకుంటాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లో క్రీడల అభివృద్ధికి పూర్తి తోడ్పాటు అందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి, అడగగానే నిధుల కేటాయింపు చేసిన కేంద్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీకు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ధన్యవాదాలు తెలిపారు. ఈ నిధుల కేటాయింపు తో ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు దూరదృష్టితో క్రీడాకారులు మరిన్ని అధ్బుతాలు అధ్బుతాలు సృష్టించడం ఖాయంగా కనిపిస్తోందని రామ్మోహన్ నాయుడు ధీమా వ్యక్తం చేశారు.

## పౌర సేవలపై ప్రజల్లో సంతృప్తి పెంచాలి

✻ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్




**శ్రీకాకుళం, జనవరి 8(వార్త):** ప్రభుత్వ పథకాలు, పౌర సేవలపై ప్రజల్లో సానుకూల దృక్పథం పెరిగేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. గురువారం సాయంత్రం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్తో కలిసి పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ దీపం పథకం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, ఆర్టీసీ, పౌరసరఫరాలు, రిజిస్ట్రేషన్ల వంటి కీలక విభాగాల్లో సేవలు మరింత మెరుగుపడాలని, అప్పుడే రాష్ట్ర స్థాయిలో జిల్లాకు మరింత మెరుగైన ర్యాంకింగ్ లభిస్తుందని స్పష్టం చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల పనితీరును జీఎస్డబ్ల్యూఎస్ కోఆర్డినేటర్లు నిరంతరం తనిఖీ చేయాలని సూచించారు. నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్కు స్థాపన, స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాల సాధనలో యంత్రాంగం వేగంగా కదలాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్వీ లక్ష్మణమూర్తి, సీపీఓ ప్రసన్నలక్ష్మి, పలువురు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

### నూతన భవన పనులను త్వరలో పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నూతన సమీకృత కలెక్టరేట్ భవన పనులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఇంతవరకు పూర్తికాని పనులు వాటి వివరములపై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుగుణాకర్ ను ప్రశ్నించారు. మిగిలి ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని త్వరగా భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546